
బంక్ జంక్షన్‌లో సింహాచలం వెళ్లే రహదారిని స్టాపర్లతో బ్లాక్ చేసిన పోలీసులు


గిరి ప్రదక్షిణకు వెళ్తున్న భక్తులు


బంక్ జంక్షన్‌లో పోలీస్ వాహనం రాంగ్ రూట్‌లో రావడంతో నిలిచిపోయిన వాహనాలు

గిరి ప్రదక్షిణలో పోలీసుల వైఫల్యం

- ట్రాఫిక్ జామ్‌తో జనం ఇక్కట్లు
- రద్దీలో ఇరుక్కున్న అంబులెన్స్
- ప్రహ్లాదపురం, సింహాచలం వెళ్లే రహదారి స్టాపర్లతో మూసివేత
- ఇళ్లకు వెళ్లలేక ఆ రెండు ప్రాంతాల ప్రజల ఇబ్బంది

గోపాలపట్నం : గిరి ప్రదక్షిణలో ఎపుడూ లేని విధంగా ట్రాఫిక్ జామ్ అయింది. గతంలో పక్కా ప్రణాళికతో వ్యవహరించిన పోలీసులు ఈసారి మాత్రం పూర్తిగా విఫలమయ్యారు. గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద సింహాచలం వెళ్లే రహదారిని మూసివేయడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఆటోలు, ద్విచక్ర వాహన చోదకులు ప్రహ్లాదపురం, సింహాచలం వెళ్లేందుకు యత్నించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రాఫిక్ ఆంక్షలు.. డైవర్షన్‌పై సమగ్ర సమాచారం లేకపోవడం కూడా ఇబ్బందులకు కారణంగా పలువురు వాహన చోదకులు, స్థానికులు విమర్శిస్తున్నారు. మధ్యాహ్నం 3 నుంచి ట్రాఫిక్ రద్దీతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. 4 గంటలకు ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారయింది.


ఎన్‌ఏడీ జంక్షన్‌లో సాగిపోతున్న 'గిరి' భక్తులు

నాలుగు వైపుల నుంచి గిరి ప్రదక్షిణకు ఆటోల్లో వచ్చే భక్తులను సింహాచలం రోడ్డులోకి అనుమతించకపోవడంతో నరకయాతన పడ్డారు. సాయంత్రం 5 గంటలకు ఈ రద్దీ ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జ్‌ను తాకిందంటే రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు. పోలీసుల ఆంక్షలతో ఇబ్బంది పడ్డామని, ఉదయం బయటికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చిందని వాహన చోదకులు వాపోతున్నారు.

తగ్గిన భక్తుల రద్దీ..

గిరి ప్రదక్షిణకు భక్తుల రద్దీ బాగా తగ్గి.. వాహనాల రద్దీ పెరిగిందని పలువురు చెబుతున్నారు. గత రెండు రోజుల నుంచి వర్షాలు పడుతుండడంతో భక్తులు తగ్గి ఉంటారని చెబుతున్నారు. ఉదయం వర్షం పడడం వల్ల ప్రయాణాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేసుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రతిసారీ మధ్యాహ్నానికే భక్తులు ప్రదక్షిణ చేసి గోపాలపట్నం చేరుకునే వారు. ఈసారి అలా జరగలేదు. ఇదిలా ఉండగా దేవస్థానం, జీవీఎంసీ అధికారులు గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. కొన్ని ప్రైవేట్ సంస్థలు, స్థానికులు ఏర్పాటు చేసిన స్టాళ్లలో భక్తులకు మజ్జిగ, టీ, కాఫీ, పళ్లు, ఫలహారాలు, డ్రింకులు అందిస్తున్నారు.


గోపాలపట్నం శ్రీరాంనగర్‌లో వాహనాల రద్దీ

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

విశాఖ విద్య: మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామని మానవ హక్కుల పరిరక్షణ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) జాతీయ కన్వీనర్, విశాఖ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆల్గా కృష్ణ అన్నారు. సింహగిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తులకు హెచ్‌ఆర్‌సీఐ ఆధ్వర్యంలో శనివారం ఎన్‌ఏడీ ఏరియాలో అన్నప్రసాద వితరణ చేశారు. **జాతీయ కౌన్సిల్** అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్, **ప్రధాన కార్యదర్శి** నందం నరసింహారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తక్కువ ధరకే టమాటా విక్రయాలు


టమాటా స్టాల్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్

విశాఖ విద్య: రైతు బజారులో తక్కువ ధరకే టమాటా విక్రయాలు చేపడుతున్నట్లు జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్ అన్నారు. శనివారం మర్రిపాలెం రైతుబజారును ఆయన పరిశీలించారు. దుకాణ దారులంతా తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలన్నారు. బయట మార్కెట్‌లో టమాటాకు డిమాండ్ ఉన్న వినియోగదారులకు అందుబాటులో ఉండేలా రైతు బజారులో తక్కువ ధరకే టమాటా అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. రైతు బజారు పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఆయన నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని షిర్డీసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని శని,ఆదివారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా శనివారం బాబాకు పంచామృతాలు,విభూదితో అభిషేకం చేపట్టారు. పట్టు వస్త్రాలు ,వెండి ఆభరణాలను బాబాకు అలంకరించారు. సాయంత్రం పల్లకీ సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సిద్ధార్థనగర్ వాటర్ ప్లాంట్ పరిశీలన


వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డులోని సిద్ధార్థనగర్ నీటి శుద్ధి ప్లాంట్‌ను కార్పొరేటర్ బొండా జగన్ శనివారం పరిశీలించారు. ఆటోనగర్ పారిశ్రామిక వ్యర్థాల వల్ల నీరు కలుషితం అవుతోందని పరిసర కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో ఆయన ఈ ప్లాంట్‌ను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఏఈ కేదార్‌నాథ్, స్థానిక నాయకులు రాజన్‌రాజు, జోసెఫ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఏ ఫిల్మ్ బై రవిశెట్టి' పోస్టర్ ఆవిష్కరణ


చిత్రం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యూపోర్టు ఎస్‌ఐ శ్యామ్ సుందర్

పెదగంట్యాడ: గాజువాకకు చెందిన యువకులు చిత్ర పరిశ్రమలో నిలదొక్కుకుని సమాజానికి ఉపయోగపడే చిత్రాలు రూపొందించాలని న్యూపోర్టు ఎస్‌ఐ శ్యామ్‌సుందర్ ఆకాంక్షించారు. ఆర్‌ఎస్ మూవీ పతాకంపై నూతన నటీనటులతో రూపొందించిన 'ఏ ఫిల్మ్ బై రవిశెట్టి' చిత్రం పోస్టర్‌ను, ఫస్ట్ లుక్‌ను న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో దర్శకుడు దివాకర్, నటుడు రవిశెట్టి, కెమెరామన్ ఉదయ్ కుమార్,ఏఎస్‌ఐ రమణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సమస్యల పరిష్కారానికి వినతి

మహారాణిపేట : పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టెక్కలిలో రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు స్వగృహంలో ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ ఆధ్వర్యంలో శనివారం బోటు యజమానులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. వీటిలో ప్రధానంగా బకాయి పడ్డ డీజిల్ సబ్సిడీ రూ. 2 కోట్ల 77 లక్షలు విడుదల చేయాలని కోరారు. వివిధ ప్రమాదాల వల్ల నష్టపోయిన సుమారు 15 మంది ఫిషింగ్ బోటు యజమానులకు నష్టపరిహారం అందజేయాలని, 2023–24 సంవత్సరానికి గాను మత్స్యకార భరోసా అందించాలని, సాంకేతిక కారణాలు చూపిస్తూ అనర్హులుగా ప్రకటించిన సుమారు 2 వేల మంది అర్హులైన వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చి వారికి కూడా భరోసా అందజేయాలని కోరారు. ఈ సమస్యలపై మంత్రి స్పందిస్తూ సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారని జానకిరామ్ తెలిపారు.

అంతా కలిస్తేనే సమాజాభివృద్ధి

మల్కాపురం : అరిస్టాటిల్ సూత్రం ప్రకారం స్నేహం మూడు రకాలు అని మల్కాపురం సెయింట్ జోసెఫ్ చర్చి ఫాదర్ ప్రదీప్ అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో సెయింట్ ఆన్స్ ఫీస్ట్ సందర్భంగా కళాశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రకాల స్నేహాల్లో మొదటిది అవసరం కోసం చేసేది, రెండోది పరస్పర ఆధారితమైన స్నేహం, మూడవది సమాజ ప్రయోజనాల కోసం వ్యక్తులు కలిసి మెలిసి చేసే స్నేహం అని తెలిపారు. ఇందులో మూడవ స్నేహాన్ని అంతా ఆచరించి సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సామాజిక సేవకు సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేస్లిన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మాల్స్‌లో 'ఆస్రా' ప్రతినిధుల తనిఖీలు


బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఆస్రా ప్రతినిధి

గాజువాక: ప్రభుత్వ ఆదేశాలతో వివిధ మాల్స్‌లో విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు నాణ్యతను, ధరల అమలును ఆస్రా (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్) ప్రతినిధులు శనివారం పరిశీలించారు. ఆస్రా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ తోట శత్రుఘ్నుడు ఆధ్వర్యంలో ప్రతినిధులు స్థానిక స్పెన్సర్స్‌లో బియ్యం, కందిపప్పు అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలుదారుల అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వ ఆదేశం ప్రకారం కిలో బియ్యం రూ.49కి, కిలో కందిపప్పు రూ.160కి విక్రయించాల్సి ఉండగా..అంతకంటే తక్కువ ధరలకే విక్రయిస్తున్నారని, నాణ్యతపై కూడా వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేశారని శత్రుఘ్నుడు తెలిపారు. కాగా, ప్యాకింగ్‌లపై తూనికలు, కొలతల విభాగం అధికారులు కూడా తనిఖీలు నిర్వహించాలని తాము కోరినట్లు పేర్కొన్నారు.

వర్షాలకు నాని.. కూలిన రక్షణ గోడ


రక్షణ గోడ కూలి దెబ్బ తిన్న ద్విచక్ర వాహనాలు

- దెబ్బతిన్న రెండు ద్విచక్ర వాహనాలు
- స్థానికుల చొరవతో శిథిలాల తొలగింపు


శిథిలాలను తొలగిస్తున్న కాలనీ వాసులు

మల్కాపురం: రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్ సంజీవ్ కాలనీ కొండ ప్రాంతంలో రక్షణ గోడ శనివారం ఉదయం 5 గంటల సమయంలో కూలింది. నిద్రలో ఉన్న ఆ ప్రాంత వాసులు గూడ కూలిన శబ్దంతో ఉలిక్కి పడి లేచారు. రక్షణ గోడ కూలడం, శిథిలాల కింద ద్విచక్ర వాహనాలు చిక్కుకోవడం గమనించారు. వర్షాలకు రక్షణ గోడ దిగువ గల మట్టి కరిగి గోడ కూలిందని కాలనీ వాసులు చెబుతున్నారు. స్థానిక యువకులు శిథిలాలను తొలగించి రెండు ద్విచక్ర వాహనాలను బయటకు తీశారు. ఆ వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.విషయం తెలుసుకున్న ములగాడ మండల రెవెన్యూ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు ఆ ప్రాంతానికి వచ్చి ప్రమాదంపై విచారించారు.

సందేశాత్మక చిత్రం 'బ్రహ్మ సో విష్ణు'


జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి, ధర్మశ్రీ

గాజువాక: ప్రజాపిత బ్రహ్మ బాబా జీవిత చరిత్రపై రూపొందించిన బ్రహ్మ సో విష్ణు చిత్రం సందేశాత్మకమైందని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. సినిమా విడుదల సందర్భంగా స్థానిక లక్ష్మీకాంత్ థియేటర్‌లో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో కక్షలు, వేధింపులతో ప్రాణాలను తీసుకుంటున్న మనుషులకు ఈ సినిమా కనువిప్పు కలిగిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రజల్లో పేద, ధనిక తేడా లేకుండా అందరూ సుఖంగా ఉండటం కోసం ప్రజాపిత బాబా చేసిన త్యాగాలపై సినిమా తీయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా బ్రహ్మ కుమారి సంస్థ కో–ఆర్డినేటర్ సోమేశ్వరి, అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, ప్రజాపిత దివ్యజ్యోతి భవన్ ఇన్‌చార్జి రామకోటి, వివిధ శాఖల ప్రతినిధులు అపరంజి, మణి, లలిత, వి.సత్య శ్యామల, మమత, శ్రీను, సియ్యాది సత్యారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


తుంగ్లాంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సిబ్బంది సూచించారు. సీజనల్ వ్యాధులపై 69వ వార్డు రెడ్డితుంగ్లాం లోని వేమన మందిరం వద్ద స్థానికులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం, మలేరియా సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగ్యూ, అతిసార వ్యాధుల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ఆర్‌జీబీ క్యాంపెయిన్‌లో భాగంగా తడి, పొడి, ప్రమాదకరమైన వ్యర్థాలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులను అరికట్టడంతో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఈ విషయంలో సహకరించాలని కోరారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల వ్యాప్తికి కారణమైన వాటిని గుర్తించి తొలగించాలని తెలిపారు. దోమతెరలను, దోమల నివారణా కారకాలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.అప్పలరాజు, ఆర్‌పీ ఆంజలి, సచివాలయం హెల్త్ సెక్రటరీ వరలక్ష్మి, ఎస్.నాగేశ్వరరావు, జయరాజు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

ముందుకొచ్చిన సముద్రం


జోడుగుళ్లపాలెం వద్ద ముందుకొచ్చిన సముద్రం నీరు


సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద ఇలా..

ఆరిలోవ: తుపాను ప్రభావంతో సముద్ర కెరటాలు ఎగసిపడుతున్నాయి. జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సముద్రం నీరు తీరంలో మరింత ముందుకొచ్చింది. జోడుగుళ్లపాలెం, సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద సముద్రం నీరు గతంలో కంటే ముందుకు చేరింది. ఒడ్డున విశాలమైన ఇసుక దిబ్బలు సగానికి పైగా మునిగిపోయాయి. సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద రాళ్లకు కొంత దూరంలో ఉండే నీరు ఇప్పుడు వాటిని దాటి ముందుకు వచ్చింది. దీంతో బీచ్ లోపలకు సందర్శకులు ఎవరూ వెళ్లే సాహసం చేయకుండా రోడ్డు మీద నుంచే కెరటాలను తిలకిస్తున్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి గిరిజన సంఘాల అభినందన


హుస్సేన్ నాయక్‌ను అభినందిస్తున్న నేతలు

ఎంవీపీకాలనీ: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జె.హుస్సేన్ నాయక్‌కు గిరిజన సంఘాలు అభినందనలు తెలిపాయి. హుస్సేన్ నాయక్ రెండు రోజులుగా విశాఖ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అఖిల భారత గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు, సభ్యులు పోర్టు గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్, పోర్టు ట్రస్ట్‌తో పాటు పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పీవీ రమణ, యామిని కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్ని వర్గాలను అలరించనున్న 'కంచర్ల'

దాబాగార్డెన్స్ : తమ ఇంటి పేరైన కంచర్ల టైటిల్‌తో ప్రతిష్టాత్మకంగా చిత్రం నిర్మిస్తున్నామని ప్రొడ్యూసర్ కంచర్ల అచ్యుతరావు తెలిపారు. ఆగస్టులో విడుదలయ్యే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుందన్నారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. షూటింగ్ పూర్తయిందని, ఈ చిత్రం ద్వారా వచ్చే లాభాలతో ట్రస్ట్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. హీరోగా ఉపేంద్ర, హీరోయిన్‌గా మీనాక్షి, ప్రణతి అద్భుతంగా నటించారన్నారు. హీరో ఉపేంద్ర మాట్లాడుతూ కంచర్ల చిత్రం గొప్ప విజయం సాధిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు


వన్‌టౌన్‌లోని కాలువలను శుభ్రం చేయిస్తున్న జెడ్సీ, ఏఎంహెచ్‌వో

జగదాంబ : వన్‌టౌన్‌లోని ప్రధాన రహదారిలో ఉన్న కాలువలను జెడ్సీ ప్రసాదరావు, ఏఎంహెచ్‌వో రాజేష్ పరిశుభ్రం చేయించారు. వరుసగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఇక్కడి ప్రధాన రహదారి జలమయం అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జెడ్సీ, ఏఎంహెచ్‌వో శనివారం ఉదయం పండుపల్లల సందు వద్ద ఉన్న పది అడుగుల కాలువలో అడ్డుపడిన వ్యర్థాలను సిబ్బందితో తొలగింపజేశారు. దీనిలో సుమారు అర టన్ను ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు ఉండడంతో మురుగు నీరు సాఫీగా పారక రహదారి పైకి చేరింది. దీని వల్ల మ్యాన్‌హోల్‌తో పాటు చిన్న కాలువలు కూడా పొంగి ప్రవహించినట్లు అధికారులు తెలిపారు. మురుగును ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి తెలిపారు.

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు


వైద్య సాయం చేస్తున్న గాయత్రీ విద్యా పరిషత్ ఆస్పత్రి సిబ్బంది


బజ్జీలు, సమోసాలు అందిస్తున్న అజంతా పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు


ఎన్‌ఏడీ వంటిల్లు జంక్షన్ సమీపంలో భక్తుల పాద సేవలో జేడీ ఫౌండేషన్ సభ్యులు


లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ వద్ద బొప్పాయి ముక్కలు అందిస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు, యూనియన్లతో పాటు స్థానిక ప్రజలు సేవలు అందించారు. సుదూర ప్రాంతం నడిచి వచ్చిన వారికి గోపాలపట్నంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు కాళ్ల నొప్పులు తగ్గేవిధంగా స్ప్రేతో పాటు మర్దన చేశారు. ఏపీఎస్‌ఈబీ కాలనీ వద్ద సాయిబాబా భజన మండలి సభ్యులు నూనెతో కాళ్లకు మసాజ్ చేస్తున్నారు. మసాజ్ వల్ల ఎంతో ఉపశమనం కలుగుతుందని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

- గోపాలపట్నం మోదకొండమ్మ ఆలయం సమీపంలో గాయత్రీ విద్యాపరిషత్ ఆస్పత్రి ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా సేవలందించారు. మందులు , బిస్కెట్లు అందించారు.
- జాతీయ రహదారి వద్ద డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో యూత్ భక్తులకు తినుబండారాలు అందించారు. కార్యక్రమంలో జియ్యాని మారుతి, విజయ్, వెంకటరమణ పాల్గొన్నారు.
- సింహాచలం ఆర్టీసీ డిపో సమీపంలో వెంకటాపురం అజంతా పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరుకు రసం, బజ్జీలు, సమోసాలు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆదిరెడ్డి శ్రీవాసరావు, వైస్ ప్రెసిడెంట్ కనకారావు, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.
- బాజి జంక్షన్ వంశీసూపర్ మార్కెట్ వద్ద లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ ఆటో యూనియన్ సభ్యులు పండ్లు, మంచినీరు. టిఫిన్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు.